చిన్నారుల సంరక్షణకు అన్ని సౌకర్యాలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, డిసెంబర్ 25 : చిన్నారుల సంరక్షణ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానని రోడ్లు భవనాలు, సినిమటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికాలను బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎస్ఎన్‌సీయూ వార్డుకు ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన చిన్నారులకు వచ్చే వ్యాధులకు చికిత్స కోసం అవసరమైన పరికరాలను అందించినట్లు తెలిపారు. త్వరలో నిర్మించనున్న భవనంలో ఒక ఫ్లోర్ మొత్తం ప్రసవాలకే కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి వెంకట్‌రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ పట్టణంలోని క్లాక్‌టవర్‌సెంటర్, దేవరకొండ రోడ్డులోని చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నగేశ్, వార్డు ఇన్‌చార్జి వందన, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఆర్‌పీఎంలు కీలకం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆర్ఎంపీలు కీలకపాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం సుశృత గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో నిర్వహించిన సంఘం వార్షిక మహాసభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంపీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పొనుగోటి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి గోగిరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు సత్యనారాయణచారి, చొల్లేటి బ్రహ్మచారి, మహ్మద్ నసీరొద్దీన్, పాలకూరి వెంకటేశ్వర్లు, పెనుగొండ లలిత, మణికుమారి, లక్ష్మణాచారి, దేవయ్య పాల్గొన్నారు.

కత్తితో గొంతు కోసుకున్న మానసిక రోగి

- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

నీలగిరి, డిసెంబర్ 25 : మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి బుధవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ వద్ద తాగిన మైకంలో గొంతు కోసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని ఆస్పత్రికి తరలించారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సయ్యద్ నదీమ్ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ రోడ్లపై తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లోనుంచి వెళ్లిన నదీమ్ లతీఫ్ సాబ్ గుట్ట సమీపంలోకి వెళ్లి మద్యం సేవించాడు. తాగిన మైకంలో కత్తితో తన గొంతు కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని గమనించిన స్థానిక యువకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు రక్తస్రావం కాకుండా గొంతువద్ద కర్చీఫ్‌తో కట్టుకట్టి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గొంతుపై స్వల్పంగా కోసుకోవడంతో కుట్లు వేశారు. ప్రాణాపాయం ఏమి లేదని తెలిపారు. మానసికంగా బాధపడుతున్న నదీమ్ తనను ఎవరో చంపాలని చూస్తున్నారని, అందుకే తానే ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించానని చెబుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. చికిత్స అనంతరం అతడి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి


తుమ్మడం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నిడమనూరు, డిసెంబర్ 25 : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని సాగర్ ఎమ్మెల్యే కుం దూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మడం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోఓల్టేజీ నివారణకు తుమ్మడం గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, ఏఈ వెంకటనర్సయ్య, నాయకులు యడవల్లి రంగశాయిరెడ్డి, నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, యడవల్లి వల్లభ్‌రెడ్డి, ముంగి శివమారయ్య, ఉన్నం చిన్నవీరయ్య, నర్సింగ్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పెదమాం యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, చేకూరి వంశీచరణ్, యడవల్లి నరేందర్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, పంచాయతీ కార్యదర్శి లింగయ్య పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని సొసైటీ వారు అందించిన దుస్తులు, దుప్పట్లను కార్మికులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను
ఆర్య వైశ్య అబ్బాయి 36 M.Ed. ప్రైవేట్ లెక్చరర్, వ్యవసాయం, 24 వేలు, ఆస్తి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు కు వ్రాయండి.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

లక్షలు పెట్టి నిర్మిస్తే.. నిర్లక్ష్యంగా వదిలేశారు

- రూ.50 లక్షలతో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- రోడ్లపై కూరగాయాల విక్రయాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్ యార్డు

నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ యార్డు

కొండమల్లేపల్లి, డిసెంబర్ 25 : మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను వినియోగించక పోవడంతో నిరుపయోగంగా మారింది. దాంతో కూరగాయల వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా, చౌరస్తాలోనే వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో తరచూ ట్రాఫిక్ జాం అవుతున్నది. దాంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సకల సౌకర్యాలతో మార్కెట్‌యార్డు

కొండమల్లేపల్లిలో రోడ్డుపైనే కూరగాయాల దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ట్రాఫిక్ జాం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూర్బన్ నిధులు రూ.50 లక్షలతో మండల కేంద్రంలోని హైదరబాద్ రోడ్డు ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో కూరగాయల మార్కెట్ నిర్మించింది. 2019లో అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మార్కెట్‌యార్డును ప్రారంభించారు. మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు పట్టుమని పది రోజులు కూడ వ్యాపారులు కూడా సాగలేదు. రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వారికి మార్కెట్‌యార్డులో దుకాణాలు కేటాయించారు. కానీ హోల్‌సేల్ వ్యాపారులు మాత్రం మార్కెట్ యార్డులోకి రాకుండా సెంటర్‌లో ఉన్న తమ షాపుల్లోనే కూరగాయాలు విక్రయిస్తున్నారు. దాంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు జనం మార్కెట్‌లోకి రాకుండా రోడ్డుపై మడిగెల్లో వ్యాపారుల వద్దే కొనుగోలు చేస్తున్నారని, తాము నష్టపోతున్నామని చిల్లర వ్యాపారులు తిరిగి రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. గతంలోనే హోల్‌సేల్ వ్యాపారులను మార్కెట్‌యార్డులోకి తరలించేందుకు ప్రయత్నించినా వారు మార్కెట్‌కు వెళ్లకుండా కోర్టుకు వెళ్లారు. దాంతో కూరగాయాల మార్కెట్ నిరుపయోగంగా మారింది.

నిత్యం ట్రాఫిక్ జామ్

కొండమల్లేపల్లి నాలుగు మండలాల కూడలి కావడంతో నిత్యం గుర్రంపోడ్, నాంపల్లి, పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, నేరేడుగొమ్ము మండలాల నుంచి అధిక సంఖ్యలో వ్యాపారులు తమ వస్తువులను విక్రయించేందుకు, కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. రైతులు తమ తెల్లవారు జామున 4 గంటలకే వ్యవసాయ ఉత్పత్తులను తీసుకొచ్చి రోడ్డు పక్కనే దుకాణాలు పెట్టి విక్రయాలు చేస్తుంటారు. దానికి తోడు మండల కేంద్రానికి చెందిన కూరగాయల వ్యాపారులు సైతం రోడ్లపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం, వాటిని కొనుగోలు చేసే వారు కూడా అధిక సంఖ్యలో రావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుండడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు అధికమవుతున్నాయి. సంబంధింత అధికారులు, పోలీసులు చొరవ తీసుకొని వ్యాపారస్తులతో మాట్లాడి సమస్యకు పరిష్కార మార్గం చూపాలని, కూరగాయాల మార్కెట్ వినియోగంలోకి తీసుకువచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

సమస్య పరిష్కారానికి కృషి

కొండమల్లేపల్లి పట్టణంలో సొంత షాపులు ఉన్నవారు కూరగాయాలు అక్కడే విక్రయించుకునేందుకు గ్రామ పంచాయతీ అనుమతి ఇచ్చిందని కోర్టులో కేసు వేశారు. హోల్‌సేల్ వ్యాపారులు మార్కెట్‌లోకి వెళ్లకపోవడంతో చిరు వ్యాపారులకు గిరాకీ రావడం లేదు. దాంతో చిరువ్యాపారులు కూడా రోడ్లపైనే విక్రయాలు సాగిస్తున్నారు. త్వరలో పోలీసులు, గ్రామ పెద్దలు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా కూరగాయాల మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం.

- బాలరాజరెడ్డి, ఎంపీడీఓ, పట్టణ ప్రత్యేకాధికారి

నేటి నుంచి కనగల్ మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, డిసెంబరు 25: కనగల్ మండలంలోని 400 కేవీ టవర్‌లైన్ స్ప్రింగ్ చేసేందుకు ఈ నెల 26 నుంచి 30 వరకు మండలంలోని పలు గ్రామాల పరిధిలోని వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుర్కపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి, ఎంగౌరారం, కనగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కనగల్, లచ్చగూడెం 11కేవీ పరిధిలో ఉన్న వ్యవసాయ ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

మాజీ ఎంఈఓ మృతికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి సంతాపం

హాలియా, డిసెంబర్ 25 : అనుముల మండల మాజీ విద్యాధికారి నిమ్మల డాకాల్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బుధవారం మండలంలోని యాచారం గ్రామానికి వెళ్లి డాకాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, పెద్దవూర ఎంఈఓ తరి రాము, పీఆర్‌టీయూ బాధ్యులు చెన్ను వెంకట్‌రెడ్డి, కొల్లి శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవుల పుల్లారెడ్డి, మందా సైదులురావు గౌతమ్, సుబ్బారావు, హనిమిరెడ్డి, పాంపాటి పాండరయ్య, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగి శ్రీను, నిరంజన్‌రెడ్డి, షేక్ జాని ఉన్నారు.

30 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్లకు అవకాశం

త్రిపురారం, డిసెంబర్ 25: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రత్యేక అడ్మిషన్ల గడువు ఈనెల 30వరకు ఉన్నదని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సైదిరెడ్డి, సహాయ కోఆర్డినేటర్ దశరథనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపెన్ స్కూల్ ద్వారా ఒక్క సంవత్సరంలోనే ఇంటర్ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్ల కోసం టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం టెన్త్ మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. వివరాలకు సెల్ : 9849573645, 8555917912 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మిర్యాలగూడటౌన్, డిసెంబర్25 : వెంకటస్వామి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చిరోడ్డులో బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఫౌండర్స్ కోడిరెక్క శౌరి, రాజేందర్, రవి, నూతన్‌కుమార్, రాజారత్నం, ఇంద్రకుమార్, కిరణ్‌కుమార్, ఇళయరాజా పాల్గొన్నారు.

కల్తీ కల్లు తాగి ఆరుగురికి అస్వస్థత

- ఇద్దరి పరిస్థితి విషమం

శాలిగౌరారం, డిసెంబర్ 25 : కల్తీ కల్లు తాగిన ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాక పిచ్చయ్య, గంట రామచంద్రు, వల్లపు లింగయ్య, దుబ్బాక అచ్చయ్య, రవి, మేడిపల్లి భిక్షం సాయంత్రం వేళల్లో గ్రామంలోని గీతకార్మికుడి వద్ద కల్లు తాగారు. కొద్ది సేపటికే వారికి వాంతులు, విరేచనాలు కావడంతో వెంటనే వారి కటుంబ సభ్యులు నకిరేకల్ పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పాక పిచ్చయ్య, దుబ్బాక అచ్చయ్యల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబద్‌కు తీసుకెళ్లారు. మిగతా నలుగురికి నకిరేకల్ దవాఖానాలోనే చికిత్స అందిస్తున్నారు. గతంలోనూ కల్తీ కల్లు తాగి ఐదుగురు అస్వస్థతకు గురైన ఘటన ఇదే గ్రామంలో చోటుచేసుకోవడం గమనార్హం.

బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొణతం సత్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి

నేరేడుచర్ల, డిసెంబర్ 25: నేరేడుచర్ల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొణతం సత్యనారాయణ రెడ్డి మనవరాలు దుర్గ శ్రేవాసిని ఇటీవల అమెరికాలో అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయ సింహారెడ్డి బుధవారం సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. దుర్గశ్రేవాసిని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మిర్యాలగూడ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ చిట్టిబాబు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, చిత్తలూరి సైదులు ఉన్నారు.

ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

నేరేడుచర్లలో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల, డిసెంబర్ 25: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఐక్యంగా పోరాడితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బుధవారం సంఘం ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని అడ్డం పెట్టుకొని ఎస్సీ వర్గీకరణతో పాటు అనేక అంశాలను పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. దేశంలో 92 శాతం పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధికారం దక్కకుండా కేవలం ఎనిమిది శాతం మాత్రమే ఉన్న అగ్రవర్ణాలు దశాబ్దాల తరబడి అధికారం చెలాయిస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాధికార సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమర్రాజు వెంకట్, మలిగిరెడ్డి జనార్దన్ రెడ్డి, పానుగంటి మహేశ్, మజరత్, కాటయ్య, లక్ష్మయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ శత వసంత సభను విజయవంతం చేయాలి'

మర్రిగూడ, డిసెంబర్ 25 : ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించే సీపీఐ శత వసంత బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో బహిరంగ సభకు నిధి సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బూడిద సురేశ్, శేఖర్, రఘురామయ్య, నిరంజన్, వెంకట్‌రామ్, అంజయ్య, నర్సింహ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అర్వపల్లి, డిసెంబర్ 25: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని రామన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి వెంకన్న (44) ఈ నెల 19న తన పొలం వద్దకు వెళ్లాడు. బోరు పోయకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ మార్చే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కోసం కృషి

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నల్లగొండ ప్రెస్ క్లబ్ సభ్యులు

నల్లగొండ రూరల్, డిసెంబర్ 25 : జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులిమామిడి మహేందర్‌రెడ్డి, గాదె రమేశ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సుఖేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. దాంతో స్పందించిన మండలి చైర్మన్ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరగా అందేలా చూస్తానన్నారు. పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గుత్తాను కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్, క్లబ్ సభ్యులు జానయ్య, రవి, సైదు లు, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, మధు, విజయ్, శ్రీను, రవిశంకర్, మల్లికార్జున్, నరేందర్, మధు, చంద్రశేఖర్, నవీన్, రాజశేఖర్ ఉన్నారు.

ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నీలగిరి, డిసెంబర్ 25 : ఆశ కార్యకర్తలకు రూ.18వేల కనీస వేతనం అందించడంతో పాటు పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, దీనిని ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి 31 వరకు నిర్వహించే బస్సు జాతా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంది. జాతాకు ఆశ కార్యకర్తలు బతుకమ్మలు, బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశ కార్యకర్తల వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ కార్యకర్తల వేతనాలు పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం చేపట్టాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ఆశ కార్యకర్తల బస్సు యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 31న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద యాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆశ కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి టి. వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శులు దండంపల్లి సత్తయ్య, ఏర్పుల యాదయ్య, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, పీఎన్ఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళి, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- డీవైఎఫ